www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 9 జూన్ 2024
5
అన్నమయ్య

కడప-బెంగళూరు రైలు మార్గం పూర్తి చేయాలి : పిసిసి

ప్రజాశక్తి-వేంపల్లె

కడప-బెంగళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైలు మార్గంను పూర్తి చేయాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డిఅన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ సర్వతోముఖాభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 2008లో కడప-రాయచోటి-బెంగళూరు కొత్త బ్రాడ్‌గేజ్ రైలు మార్గాన్ని మం జూరు చేసిందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం ఖర్చు భరించే షరతులతో మంజూరైనట్లు చెప్పారు. 2010లో కేంద్ర మంత్రి మునియప్ప శంకుస్థాపన చేశారని చెప్పారు. కడప నుంచి పెండ్లిమర్రి వరకు 21.80 కిలో మీటర్ల మేరకు రైల్వే లైన్ పూర్తైనట్లు చెప్పారు. రూ.351 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ.132 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. దురదృష్టవశాత్తు జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తన వాటా నిధులను విడుదల చేయలేదని చెప్పారు. కడప-బెంగళూరు రైలు మార్గం పనులు నిలిచి పోయినట్లు చెప్పారు. రైలు మార్గాన్ని రద్దు చేయాలని 17-6-2021లో జగన్ రైల్వే శాఖకు లేఖ రాశారన్నారు. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయన్నారు. కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే తన వాటా కింద విడుదల చేయాల్సిన నిధులను విడుదల చేసి రైల్వే పనులను తిరిగి ప్రారంభించాలని కోరారు.

జిజిహెచ్‌లో గోల..గోల..!

- డిడిపై...సీనియర్ అసిస్టెంట్ తిరుగుబాటు
- ఓ ఆఫీస్ సూపరింటెండెంట్‌పై దాడికి యత్నం
- సూపరింటెండెంట్ పర్యవేక్షణ కొరవడిన ఫలితమే
- పోలీసు రంగ ప్రవేశంతో సద్దుమణిగిన వైనం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి దాడులు.. తిరుగుబాటులతో దద్దరిల్లింది. ఇటీవల ఓ కంపాసినేట్ అపాయింట్‌మెంట్ విషయంలో డిడి వర్సెస్ సీనియర్ అసిస్టెంట్ మధ్య ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ఇది డిడిపై సీనియర్ అసిస్టెంట్ బృందం తిరుగుబాటుకు దారితీసింది. కంపాసినేట్ అపాయింట్‌మెంట్ ఫైలును సకాలంలో ఎందుకు పంపించలేదనే మందలింపు డిప్యూటీ డైరెక్టర్‌కు వ్యతిరేకంగా లేఖ రాయడానికి దారితీసినట్లు సమాచారం. సదరు లేఖపై 12 మంది కార్యాలయ సిబ్బందిలో ఇద్దరు మహిళా ఉద్యోగులు సంతకం చేయలేదనే ఆగ్రహంతో ఓ మహిళా సూపరింటెండెంట్‌పైకి ముగ్గురు సిబ్బంది దాడికి ప్రయత్నించినట్లు తెలిసింది. ఆమె చేసేదేమీ లేక 101కు ఫోన్ చేసి పోలీస్ సహాయన్ని ఆశ్రయించినట్లు సమాచారం. పోలీసు, ఓ మహిళా ఆర్ఎం మధ్యవర్తిత్వంతో ఘర్షణ వాతావరణం సద్దుమణిగినట్లు తెలుస్తోంది. ఘర్షణ వాతావరణానికి గల కారణం 10 రోజుల్లో సీనియర్ అసిస్టెంట్‌కు ఉద్యోగోన్నతి వ్యవహారమేనని తెలుస్తోంది. జిజిహెచ్‌లో ఉన్న ముగ్గురు ఆఫీస్ సూపరింటెండెంట్‌ల్లో ఇద్దరు స్థానికేతరులు. వీరిలో ఒకరిని సరెండర్ చేయాలని కోరడం, అతని స్థానంలో సదరు సీనియర్ అసిస్టెంట్ రావాలనుకోవడం, సహేతుక కారణాలు లేనిదే సరెండర్ చేయడమెలా అని డిప్యూటీ డైరెక్టర్ నిరాకరించడం, స్పౌస్‌ను నిర్ధారించే వ్యవహారంపై సూపరింటెండెంట్ ఎస్ఆర్‌లు పరిశీలన చేయకుండా సంతకం చేయలేదనే అక్కసు ఘర్షణ వాతావరణానికి తోడైనట్లు తెలిసింది. సీనియర్ అసిస్టెంట్ బృందం సైతం తమ పట్ల డిప్యూటీ డైరెక్టర్ దురుసుగా వ్యవహరించాడని, స్పౌస్ సంతకం విషయం ఇబ్బంది పెడుతున్నారనే వాదన వినిపిస్తున్నారని ఫిర్యాదు చేశారని డిప్యూటీ సూపరింటెండెంట్ పేర్కొనడం గమనార్హం. ఇలా ఎవరి వాదన వారిది అన్న చందంగా ఉందని చెప్పవచ్చు. కొన్నేళ్లుగా జిజిహెచ్ సూపరింటెండెంట్ పర్యవేక్షణ కొరవడిన ఫలితమే ఘర్షణ వాతావరణానికి కారణమనే వాదన వినిపిస్తోంది. జిజిహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి అనారోగ్య కారణాల పేరుతో చురుకుగా పనిచేయడం లేదనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది.

ఘర్షణ వాతావరణం నిజమే!

జిజిహెచ్‌లో ఘర్షణ వాతావరణం నెలకొన్న మాట నిజమే. డిడి తమ పట్ల దురుసుగా వ్యవహరించారనే పేరుతో సీనియర్ అసిస్టెంట్ బృందం ఫిర్యాదు చేసింది. దీనిపై డిడి, సీనియర్ అసిస్టెంట్ బృందాల్ని పిలిపించి ఇరువురిని మందలించి సర్దుబాటు చేశానని పేర్కొనడం గమనార్హం.

- సురేశ్వరరరెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్, జిజిహెచ్, కడప.

నీరుగారుతున్న 'ఉద్యాన' లక్ష్యం

విస్తరణ పథకం పునరుద్ధరణ అయ్యేనా?

ఐదేళ్లుగా అరకొరగా నిధులు కేటాయింపు

పండ్ల తోటల రైతులు ఎదురుచూపు

ప్రజాశక్తి-సింహాద్రిపురం

పండ్ల తోటల రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఉద్యాన విస్తరణ పథకం గత ప్రభుత్వ హయాంలో అరకొరగా నిధులు కేటాయింపుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యాన వన పంటలు విస్తరించాలని లక్ష్యంతో ఈ పథకాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఈ పథకానికి నిధులు కేటాయింపు జరగకపోవడంతో లక్ష్యం నీరుగారి పోయింది. గత ఐదేళ్లుగా కేవలం అరకొరగా మాత్రమే నిధులు కేటాయించారు. అర్హత కలిగిన రైతులకు పథకం లభించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఈ పథకం ద్వారా చీనీ, నిమ్మ, జామ, దానిమ్మ, అరటి, బొప్పాయి లాంటి తోటలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహంగా సాగు చేసే రైతులకు ఆర్థిక సహాయం అందేది. టమోటా, కలింగర, లాంటి స్వల్పకాలిక పంటలలో మల్చింగ్ సీట్ వేసుకునే రైతులకు సైతం ప్రోత్సాహం లభించేది. మరింత విస్తీర?ంలో పంట సాగుకు ఉపయోగకరంగా ఉండేదని రైతులు చెబుతున్నవారు. గతంలో నూతనంగా చీనీ, నిమ్మ సాగు చేసే రైతులకు రెండు సంవత్సరాలకు కలిపి హెక్టార్‌కు రూ.16,004, అరటికి హెక్టర్‌కు రెండు సంవత్సరాలకు కలిపి రూ.40,700, దానిమ్మకు మూడు సంవత్సరాలకు కలిపి రూ.18 వేలు, బొప్పాయికి రెండు సంవత్సరాలకు రూ.25 వేలు చొప్పున ప్రోత్సాహం కింద రైతులకు ప్రభుత్వం అందించేది. ఈ పథకం నీరుగారిపోవడంతో సాగు చేసే రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ పథకాన్ని తిరిగి పునరుద్ధరణ చేయాలని ఉద్యాన వన తోటల రైతులు కోరుతున్నారు.

విస్తారంగా అరటి సాగు

కొన్ని సంవత్సరాల నుంచి వేరుశనగ, పొద్దుతిరుగుడు లాంటి వాణిజ్య పంటలు సాగుచేసిన రైతులు తీవ్ర నష్టాల కారణంగా ఉద్యానవన పంటల వైపు ఆసక్తి చూపుతున్నారు. మండల వ్యాప్తంగా ఈ ఏడాది 450 హెక్టార్లలో అరటి సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. ఇటీవల కాలంలో అరటి మొక్కలు ధరలు పెరగడంతో పాటు పెట్టుబడి వ్యయం గణనీయంగా పెరిగింది. ఈ తరుణంలో పథకం పునరుద్ధరణ చేపడితే మరింత సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని ఉద్యానవన రైతులు చెబుతున్నారు. అరటి కాయలు విదేశాలకు ఎగుమతి కారణంగా రాష్ట్ర జిడిపి సైతం పెరిగే అవకాశం ఉందని కావున ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుని పథకాన్ని పునరుద్ధరణ చేయాలని రైతులు కోరుతున్నారు.



తెలికి గ్రామంలో సాగుచేసిన అరటి

కొత్తగా సాగు చేసే రైతులకు కాస్త ఊరట

అరటి సాగు చేసే రైతులకు ఈ పథకం కాస్త ఊరటగా ఉంటుంది. ఇటీవల కాలంలో అరటి సాగు పెట్టుబడి వేయడం ఖర్చులు భారీగా పెరిగాయి. కావున ప్రభుత్వాలు తిరిగి ఈ పథకాన్ని పునరుద్ధరణ చేసినట్లయితే కాస్త ఊరటగా ఉంటుంది.

- రవిశంకర్, అరటి రైతు, గురజాల.

చీనీ, అరటి రైతులకు ఎంతో ఉపయోగకరం

నూతనంగా అరటి, చీనీ సాగు చేసే రైతులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉండేది. ఉద్యాన విస్తరణ పథకం కింద పండ్ల తోటల రైతులు ఎంతో లబ్ధి పొందేవారు. ఈ పథకంలో అరకొరగా ఇవ్వడంతో చాలామంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఈ పథకాన్ని పునరుద్ధరణ చేయాలి.

- అనిల్ కుమార్‌రెడ్డి, చీనీ రైతు, బలపనూరు.

గృహ నిర్మాణ సంస్థలో రూ.100 కోట్ల అవినీతి

సమావేశంలో మాట్లాడుతున్న రమేష్ కుమార్, రఘురామ నాయుడు

బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప జిల్లా ఎన్‌జిఒ కో-ఆపరేటివ్ గృహ నిర్మాణ సంస్థలో రూ.100 కోట్లకు పైగా అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని, దీనికి బాధ్యులైన అధ్యక్షులు ఎల్.కొండారెడ్డి, ప్రభుత్వ సలహాదారుగా ఉన్న చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు కె.వి.శివారెడ్డిపై విచారణ జరిపి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.రమేష్ కుమార్, కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వి.రఘురామనాయుడు డిమాండ్ చేశారు. శనివారం అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కొండారెడ్డి ఎన్నో అవినీతి అక్రమాలు చేశారని తెలిపారు. వీటిపై సభ్యులు, డైరెక్టర్లు, కొన్ని సంఘాల ప్రతినిధులు, ఉన్నతా ధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు 2022, అక్టోబర్ 20న డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీస్ హిందూపురం వారిని విచారణ అధికారిగా నియమించి రిపోర్టు సమర్పిం చాలని ఆదేశించారని పేర్కొన్నారు. విచారణ అధికారి అర్జీలను పరిశీలించి అవినీతి అక్రమాలు జరిగాయని రిపోర్టును రాష్ట్ర కమిషనర్‌కు సమర్పించారని తెలిపారు. కమిషనర్ విచారణకు ఆదేశించారని చెప్పారు. ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి సహకార శాఖ మంత్రి చేత స్టే ఇప్పించాలని పేర్కొన్నారు. కొండారెడ్డి తమకాల పరిధిలో సుమారు 400 ఇళ్ల స్థలాలను అర్హులైన సభ్యులకు కాకుండా వారికి నచ్చిన వారికి కేటాయించాలని తెలిపారు. ప్రజా ప్రయోజనాల కోసం 1978 నుంచి ఉన్న 41 చదరపు గజాల స్థలంలో అపార్ట్మెంట్ నిర్మించాలని చెప్పారు. అవకతలతో పాటు, నచ్చినవారికి వాటిని కట్ట పెట్టారని పేర్కొన్నారు. సొసైటీ స్థలంలో రోడ్డు వేసే క్రమంలో టెండర్ల ప్రక్రియ కాకుండా కొండారెడ్డి పనులు చేయించి అవినీతికి పాల్పడ్డారని తెలిపారు. ప్రభుత్వం రికార్డులను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టి కో-ఆపరేటివ్ అధికారి సుభాషిని, వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు కె.వి.శివారెడ్డిపై శాఖ పరమైన క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కె.వి.సుబ్బయ్య, బి.వి.చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

ఆర్ఓ ప్లాంట్ల నుంచి అందని తాగునీరు

పీలేరులో మూతపడిన ఆర్ఓ ప్లాంట్

ప్రజాశక్తి - పీలేరు

ఆర్ఓ ప్లాంట్ల నుంచి ప్రజలకు ఉచిత తాగునీటి పంపిణీ జరగడం లేదన్న ఆరోపణలు పీలేరు పట్టణంలో వెల్లువెత్తాయి. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైసిపికి ఓట్లు వేయలేదన్న అనుమానం, అక్కసుతోనే ఆ పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉచిత నీటి బట్వాడాను అడ్డుకుంటున్నారన్న అనుమానాలు స్థానికుల నుంచి వ్యక్తమవుతున్నాయి. పీలేరు పట్టణ పరిధిలో సుమారు 23 శుద్ధ నీటి పంపిణీ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వీటిలో కొన్ని రాజంపేట పార్లమెంటు నియోజకవర్గం సభ్యుడు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి ఎంపీలాడ్స్‌లో ఏర్పాటు చేసినవి కాగా, మరికొన్ని జడ్పీ నిధుల నుంచి జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎండి షఫీ ఏర్పాటు చేయించినవి, ఇంకొన్ని గ్రామపంచాయతీ నిధులతో ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నవి. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉండగా వీటి ద్వారా ఉచిత శుద్ధ నీరు నిర్విరామంగా వినియోగదారులకు అందిస్తూ వచ్చారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి, ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిలకు స్థానిక ప్రజలు ఓట్లు వేసి మెజారిటీ అందివ్వలేదన్న అనుమానంతో ఎంపీ లాడ్స్‌తో ఏర్పాటు చేసి, కాంట్రాక్టర్ పర్యవేక్షణలో నడుస్తున్న కొన్ని శుద్ధ నీటి ప్లాంట్లు మరమ్మతులకు గురయ్యాయన్న కారణం చూపుతూ వాటి నిర్వాహకులు కొన్ని రోజులుగా నీటి సరఫరాను నిలిపివేశారని, స్థానికులు ఆరోపిస్తున్నారు. వారి అనుమానాలను మరింత బలం చేకూరుస్తూ స్థానిక చెన్నారెడ్డి కాలనీలో రెండు రోజుల క్రితం వైకాపా సానుభూతిపరులు కొందరు ఆర్ఓ ప్లాంట్ దగ్గరున్న నీటి సరఫరా పైపులు, కొళాయిలను కొందరు వైసిపి సానుభూతిపరులు ధ్వంసం చేశారని అక్కడి స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్కడ చోటు చేసుకున్న సంఘటనపై స్థానికలు పంచాయితీ సర్పంచుకు తెలియజేశారు. స్పందించిన సర్పంచ్ షేక్ జీనత్ షఫీ యుద్ధ ప్రాతిపదికన ఆ ప్లాంట్ వద్ద ధ్వంసమైన పైపులు, కొళాయిలకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా పట్టణంలో మరికొన్ని ఆర్ఓ ప్లాంట్ల నుంచి కూడా నీటి సరఫరా జరగడం లేదన్న సమాచారాన్ని సర్పంచ్ అందుకున్నారు. దీంతో ఈ సమస్యను సర్పంచ్ ఫోన్ కాల్ ద్వారా ఎంపీ పిఎ దృష్టికి తీసుకువెళ్లారు. అందుకు స్పందించిన పిఎ కూడా వైకాపా కార్యకర్తలు, సానుభూతిపరులు, అభిమానులు ఎవరూ ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడవద్దని, సంవయమనం పాటిస్తూ, ప్రజలకు సహకరిస్తూ, పార్టీకి, ఎంపీకి మంచి పేరు తేవాలని సూచించినట్లు సమాచారం. స్థానిక సర్పంచ్ వేణు వెంటనే నీటి సరఫరా సిబ్బందితో సమావేశమై ప్రజలకు నీటిని పంపిణీ చేయడం ఇష్టం లేని వారు తమ విధులనుంచి తప్పుకోవాలని, వారి స్థానంలో మరొకరికి అవకాశం కల్పించి, ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా పంచాయితీ తరఫున సరఫరాకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించామన్నారు. ఈ సందర్భంగా వాటర్ ప్లాంట్లలో పనిచేస్తున్న సిబ్బంది మాట్లాడుతూ కాంట్రాక్టరు తమకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వని కారణంగానే తాము నీటి సరఫరాను ఆపామని, అంతకుమించి వేరే కారణాలు లేవని సర్పంచుకు చెప్పారు. సర్పంచ్ మాట్లాడుతూ ఇకనుంచి పంచాయితీ ద్వారా సిబ్బంది వేతనాలు చెల్లించడం జరుగుతుందని, ఎలాంటి ఫిర్యాదులు లేకుండా ఉచిత తాగు నీటిని ప్రజలకు పంపిణీ చేయాలని ఆదేశించినట్లు సర్పంచ్ పేర్కొన్నారు.

ప్రశంసా పత్రాలతో మిట్స్ విద్యార్థులు

ప్రాజెక్ట్ ఎక్స్‌పోలో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -మదనపల్లె అర్బన్

అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బి.టెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు గూడూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన జాతీయ స్థాయి ప్రాజెక్ట్ ఎక్స్‌పో పోటీలలో ప్రతిభ కనపరచి మొదటి బహుమతి సాధించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. బి.టెక్ మొదటి సంవత్సరం ఇసిఇ, మెకానికల్ ఇంజినీరింగ్, ఇఇఇ మొదటి సంవత్సరం చదువుతున్న జి.జుబేర్, విథామస్, కీర్తి, నవాజ్, ప్రవల్లిక, రమేష్, హేమంత్, జాహ్నవి ఈ పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. వారు తయారు చేసిన ప్రాజెక్టులను ఈ ఎక్స్‌పోలో ప్రదర్శించి ప్రతిభ కనబరచడంత మొదటి, రెండు బహుమతులు గెలుచుకున్నారని పేర్కొన్నారు. మొదటి సంవత్సరంలోనే ఈ విద్యార్థులు స్మార్ట్ సస్టైనబుల్ కూలర్, స్మార్ట్ సస్టైనబుల్ హెల్మెట్, సోలార్, ఫెడల్ ఆపరేటెడ్ మిల్లట్లు, గ్రైండింగ్ మెషిన్‌లు కనిపెట్టి అందరిని ఆకర్షించినట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేయడంతో పాటు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, వర్క్ షాప్ హెడ్ డాక్టర్ లక్ష్మణ్‌రావు అభినందనలు తెలిపారు.

కొల్లు రవీంద్రకు సత్కారం

ప్రజాశక్తి -మదనపల్లె అర్బన్

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా విజయం సాధించిన మాజీమంత్రి టిడిపి ఎమ్మెల్యే కొల్లు రవీంద్రను బెస్త సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమాలవేసి, పుష్పగుచ్ఛం ఇచ్చి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ బెస్తల సంక్షేమం, అభివృద్ధికి తోడ్పడాలని కొల్లు రవీంద్రను కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన ఖచ్చితంగా అభివృద్ధి చేయడంతో పాటు అన్ని విధాల ఆదుకుని అండగా ఉంటామని హామీనిచ్చారని తెలిపారు.

కొల్లు రవీంద్రను సన్మానిస్తున్న రమణ

నారా లోకేష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

లోకేష్‌ను కలిసిన 'మండిపల్లి'

ప్రజాశక్తి-రాయచోటి

మంగళగిరి నుంచి అత్యధిక మెజారిటీతో గెలుపొందిన మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌ను శుక్రవారం మంగళగిరిలోని ఆయన నివాసంలో రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కలిశారు. అనంతరం రాయచోటిలో శాసనసభ సభ్యులుగా మొదటిసారి ఎన్నికైన రాంప్రసాద్‌రెడ్డిని కూడా 20 సంవత్సరాల కంచుకోటను బద్దలు కొట్టావు అని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండిపల్లి మాట్లాడుతూ రాయచోటిని అన్ని విధాల అభివృద్ధి చెందడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, లోకేష్‌బాబు సహాయ సహకారాలు అందించాలని అన్నారు. భూ ఆక్రమణలు చేసి పేదల నుంచి లాక్కున్న భూములపై విచారణ జరిపించి తిరిగి ఆ భూములను పేదలకు చెందేలాగా చూడాలని కోరినట్లు తెలిపారు. గతంలో టిడిపి కార్యకర్తలు, నాయకులపై బనాయించిన అక్రమ కేసులను కూడా తొలగించాలని కోరారు. రాబోయే కాలంలో మునుపెన్నడూ లేనివిధంగా రాయచోటిని అభివృద్ధి చేసి చూపిస్తామని భూములు విషయంలో కార్యకర్తల విషయంలో కూడా న్యాయం జరిగేలా చేస్తామని హామీనిచ్చారని తెలిపారు.

ప్రయివేట్ పాఠశాలల ప్రచారాన్ని నిలువరించాలి : పిడిఎస్‌యు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రంలో ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం ఆరంభించిన ప్రచారాన్ని వెంటనే నిలువరించాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు నేతి నాగేశ్వర డిమాండ్ చేశారు. శనివారం మండల విద్యాశాఖ అధికారి రఘునాథరాజుకు శనివారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వర మాట్లాడుతూ ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం లేని వసతులు ఉన్నట్లు చూపిస్తూ కరపత్రాలు ఆవిష్కరించి పట్టణాలు, గ్రామాలలో ఉపాధ్యాయులచే పంపిణీ చేయించి విద్యార్థుల తల్లిదండ్రులను మోసగిస్తున్నారని ఆరోపించారు. కొన్ని పాఠశాలలలో కనీసం మౌలిక వసతులు లేవని, వ్యాయామ ఉపాధ్యాయుడు, క్రీడా మైదానం వంటివి లేవని తెలిపారు. పాఠశాలల ఏర్పాటు, నిర్వహణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన సుమారు 40 నిబంధనలలో ఏఒక్కటీ పాటించకుండా విద్యాశాఖ కార్యాలయాలలో ప్రయివేట్ పాఠశాలలు తప్పుడు పత్రాలు సమర్పిస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు చాలీచాలని వేతనం ఇస్తూ వారి చేత వెట్టి చాకిరి చేయించుకోవడమే కాక ఉపాధ్యాయులని కూడా చూడకుండా వారిని అడ్మిషన్ల కోసం వీధుల వెంట తిప్పుతున్నారని అన్నారు. మితిమీరిన ప్రయివేట్ పాఠశాలల ఆగడాలను విద్యాశాఖ అధికారులు అరికట్టాలని డిమాండ్ చేశారు.

బెల్ట్‌లు సాధించిన క్రీడాకారులతో మాస్టర్లు

ఏకలవ్య అకాడమీలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : ఏకలవ్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో శనివారం మాస్టర్లు ఆర్.ఎన్.రెడ్డి ప్రవీణ్, ఉద్దండపు బాలాజీల ఆధ్వర్యంలో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో పదిమంది క్రీడాకారులు ఎల్లో బెల్ట్, ఐదుగురికి గ్రీన్ బెల్టు, ఒక క్రీడాకారిణి రెడ్ బెల్ట్‌లో ఉత్తీర్ణత సాధించినట్లు మాస్టర్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ చెన్నూరు సునీల్ కుమార్, ప్రభుత్వ ఉపాధ్యాయులు ఓబులేసు పాల్గొని మాట్లాడారు. బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ అంటే సామర్థ్య పరీక్ష అని, ఇందులో క్రీడాకారులు తమ సామర్థ్యంతో పాటు ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన వారికి సర్టిఫికెట్లు, బెల్టులు అందజేస్తామన్నారు. తేక్వాండో సాధనతో ఆత్మ రక్షణ మాత్రమే కాక ఆరోగ్యవంతులుగా ఉంటూ నిత్యం ఆత్మవిశ్వాసంతో మెలగుతారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు పెద్దపీట వేస్తూ క్రీడా కోటా ద్వారా ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తు న్నారని అన్నారు. విద్యార్థులు కఠోర సాధన చేసి ఒలంపిక్ స్థాయికి ఎదిగి రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని రావాలని సూచించారు. అనంతరం ఉత్తీర్ణత సాధించిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపి బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు పి.శివ కుమార్, ఎ.వికాస్, కె.ఎల్ భార్గవి, కె.ఎల్ జ్వలిత లక్ష్మి, డి.అక్షయ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వీరభద్ర స్వామి పాలక మండలి సభ్యులు రాజీనామా

ప్రజాశక్తి-రాయచోటి : పట్టణంలోని వెలసిన శ్రీ వీరభద్రస్వామి దేవస్థానమునకు సంబంధించిన ఆలయ పాలకమండలి సభ్యులు రాజీనామా చేస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణ కార్య నిర్వహణ అధికారి పివి రమణారెడ్డి శనివారం తెలిపారు. పొలంరెడ్డి విజయ చైర్మెన్, రత్నశేఖర్‌రెడ్డి-మెంబర్, అర్.నరసింహులు-మెంబర్, బి.విజయ భాస్కర్-మెంబర్,విజయ-మెంబర్, లక్ష్మి-మెంబర్, భారతమ్మ-మెంబర్, నాగభూషణం మెంబెర్, కే.సురేష్ కుమార్-మెంబర్ తొమ్మిది మంది ధర్మకర్తల మండలి సభ్యులు వీరి పదవులకు రాజీనామ చేశారు. రాజీనామా విషయాన్ని దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్‌కు నివేదిక పంపినట్లు తెలిపారు.

నైరాశ్యం

ప్రజా'దృష్టి'

సార్వత్రిక ఎన్నిక వైసిపిలో నైరాశ్యాన్ని నింపింది. సంక్షేమాన్ని నమ్ముకుని పార్టీని గాలికి వదిలేసిన ఫలితం వైసిపికి చేదుఅనుభవాల్ని మిగిల్చింది. పార్టీని, ప్రభుత్వాన్ని వొలపటి...దాపటి ఎద్దుల చందంగా సమన్వయంగా నడిపించడంలో వైఫల్యమే ఓటమికి ప్రధాన కారణమని చెప్పవచ్చు. వైఎస్ జగన్ నెలనెలా సంక్షేమ క్యాలెండర్ ప్రకారం డిబిటి, నాన్ డిబిటి పద్ధతుల్లో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసిన సంగతి తెలిసిందే. సంక్షే మాన్ని నమ్ముకుని పార్టీ కేడర్‌ను విస్మరించిన ఫలితమే ఘోర ఓట మికి దారి తీసింది. అధికార పార్టీకి చెందిన పలువురు నాయకులకు పనులు కేటాయింపులు చేయకపోవడం, అత్తెసరు బిల్లుల్ని సైతం సకాలంలో చెల్లించకపోవడంతో భూకబ్జాలకు భారీ ఎత్తున తెర తీశారు. బద్వేల్‌లో తహశీల్దార్ సీళ్లతో సహా డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుని పలువురిపై ఆర్డీఓ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఇంతలోనే అధికార పార్టీకి చెందిన ఓ ఎమ్మెల్యే భూముల్నే కబ్జా చేయడం, ఓ ప్రముఖ పారిశ్రామికవేత్త స్థలాన్ని సైతం కబ్జా చేయడానికి ప్రయత్నించడం, ఆయన తీవ్ర స్వరంతో హెచ్చరించడం, వదిలిపెట్టడం వరకు సాగిపోయింది. చివరికి కడప నగర సమీపంలోని స్మశానాల్ని సైతం ఆక్రమించుకుని హౌసింగ్ లేఅవుట్ వెంచర్ల ఏర్పాటు చేయడం చర్చనీయాంశంగా మారడం తెలిసిందే. ఇసుక అక్రమ రవాణాకు అంతు లేకుండాపోయింది. అన్నమయ్య జిల్లాలో అన్నమయ్య, పింఛా రిజర్వాయర్లు కొట్టుకుపోవడానికి అధి కార పార్టీకి చెందిన ఇసుకా సురులే కారణం కావడం గమనార్హం. దీనిపై విధులు నిర్వహించడానికి వెళ్లిన పాత్రికేయులపై కేసులు నమోదు చేయించడం వరకు హద్దు లేకుండా చెలరేగిపోవడం పరా కాష్టకు చేరుకుంది. ప్రపంచంలోనే ఎక్కడా లభించని అరుదైన ఎర్ర చందనం స్మగ్లింగ్ హద్దు లేకుండా చెలరేగిపోవడం చర్చనీయాం శంగా మారింది. మూడేళ్ల కిందటి స్థానిక సంస్థల ఎన్నికల్లో మాట వినని ప్రతిపక్ష అభ్యర్థులను ఎర్రచందనం దుంగల పేరుతో తప్పుడు కేసులు పెడతామనే బెదిరింపులకు పాల్పడి ఏకగ్రీవాలు చేసుకోవడం దారుణం. ఇటువంటి అవాంఛనీయ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రజల్లో నెలకొన్న ఆగ్రహావేశాలు వైసిపి అహంకారానికి గట్టిగా బుద్ధి చెప్పాయనే విశ్లేషణలు వినిపిస్తుండడం గమనార్హం. కడప, రాజంపేట పార్లమెంట్ అభ్యర్థులు వైసిపికి చెందిన సిట్టింగ్ ఎంపీలు అత్తెసరు మెజార్టీలతో గెలుపొందడం స్వల్ప ఉపశమనాన్ని కలిగించింది. కడప పార్లమెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిలకు పెద్ద ఎత్తున క్రాస్‌ఓటింగ్ నడిచింది. గుడ్డి తప్పి కన్ను లొట్ట బొయిన చందంగా గెలుపొందడం పలువురి దృష్టిని విశేషంగా ఆకర్షిం చింది. అసెంబ్లీ స్థానాల విషయానికి వస్తే పులివెందుల, బద్వేల్, రాజంపేట, తంబళ్లపల్లి మినహా మిగిలిన తొమ్మిది అసెంబ్లీ స్థానాల్ని ప్రతిపక్ష టిడిపి ఎగరేసుకునిపోయింది. పులివెందుల మెజార్టీ మినహాయిస్తే మిగిలినవన్నీ అత్తెసరు మెజార్టీలే కావడం గమనార్హం. ఇప్పటికైనా వైసిపి నాయకత్వం పార్టీ నేతలను క్రమశిక్షణలో పెట్టి అదుపులో ఉంచితేనే ప్రజాభిమానానికి పాత్రులవుతారని చెప్ప వచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వృద్ధులు, చిన్నారులకు దుప్పట్లు అందిస్తున్న రాజశేఖర్

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తమ ఫౌండేషన్ ద్వారా నిర్విరామంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తగాది రాజశేఖర్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిస్వార్థమైన సేవే లక్ష్యంగా ఫౌండేషన్ స్థాపించామని చెప్పారు. శనివారం బెంగళూరు నగరం సమీపంలోని హొసకోట వద్ద గల ఎంఎన్‌వి ఫౌండేషన్‌లో సుమారు 70 మంది వృద్ధులు, చిన్నారులకు దుప్పట్లు అందించామని చెప్పారు. సేవా కార్యక్రమాల్లో సంస్థ సభ్యుల సహకారం మరువలేనిదన్నారు. అటు ఎపి ఇటు కర్ణాటకలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

అనుభవజ్ఞుడిని కోశాధికారిగా నియమించాలి

ప్రజాశక్తి-కలకడ

అకౌంట్స్‌లలో అనుభవం ఉన్న వ్యక్తిని మండలాల్లో కోశాధికారులుగా నియమించాలని అధిష్టానం తెలిపినట్లు మండల మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు గంగాధర్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరం మానవతా నూతన కమిటీల ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మానవతా కన్వీనర్లకు తెలిపారు. మానవతా కమిటీ ల ఏర్పాటు చేసి జూన్ నెలాఖరులోపు ప్రమాణ స్వీకారం చేయాలని అన్నారు. నూతన కమిటీల ఎంపికలో సేవాభావం ఉన్న స్త్రీలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



ధ్వంసమైన బస్‌షెల్టర్

బస్ షెల్టర్‌పై దాడి శోచనీయం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ప్రజలకు నిత్యం ఉపయోగపడే బస్సు షెల్టర్ పై దాడి శోచనీయమని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని టోల్‌గేట్ సెంటర్ వద్ద వైసిపి నాయకులు వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి ప్రయాణికుల ఇబ్బందులను గమనించి వారికి నిత్యం అవసరమయ్యే బస్‌షెల్టర్, మరుగుదొడ్లను తన సొంత నిధులతో నిర్మించారు. ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులు బస్ షెల్టర్ లో ఏర్పాటుచేసిన కుర్చీలలో చల్లని ఫ్యాను గాలి కింద వేచి ఉండేవారు. ఇటీవల ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందని కొంతమంది అల్లరి మూకలు బస్ షెల్టర్ వద్ద ఏర్పాటుచేసిన ఫోటోలను రాళ్లతో ధ్వంసం చేశారు. బస్సు షెల్టర్ కు నీరు,విద్యుత్ సరఫరా కూడా ఆపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికార, ప్రతిపక్ష నాయకులు సైతం ఈ దాడిని తీవ్రంగా ఖండించారు.

కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకటప్రసాద్

గాలివీడులో పోలీసు కవాతు

ప్రజాశక్తి-గాలివీడు

మండల కేంద్రమైన స్థానిక గేటు నుంచి బస్టాండ్ వరకు ఎస్ఐ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు మండలంలో జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. బిఎస్ఎఫ్ జవానులు ఇరవై మంది పోలిస్టేషన్‌కు వచ్చారని ఎటువంటి అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

అసలు సూత్రధారులను శిక్షించాలి

ప్రజాశక్తి - చాపాడు

బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండి వాసుదేవరెడ్డిపై గత అయి దేళ్లల్లో మద్యం కొనుగోళ్లపై జరిగిన అక్రమాలపై సిఐడి కేసు నమోదు చేసినదని, కానీ ఈ కేసులో అసలు సూత్రధారులైన మాజీ సీఎం జగ న్మోహన్‌రెడ్డి, మాజీ ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని శిక్షించాలని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ మద్యం తయారీ, కొనుగోళ్లు, సరఫరా, విక్రయాలు అన్నిం టిని అధికారం అడ్డు పెట్టుకొని రూ.20వేల కోట్ల ప్రభుత్వ సొమ్మును కాజేశారని ఆరోపించారు. వేల మంది నాసిరకం మద్యం తాగి మరణించారని గుర్తు చేశారు. వీరిపైన ఆధారపడిన కుటుంబాలు రోడ్డుపా లయ్యాయని తెలిపారు. గత అయిదేళ్లల్లో రూ.1,24,000 కోట్ల మద్యాన్ని అమ్మి గత ప్రభుత్వం భారీ దోపిడీకి పాల్పడిందన్నారు. ఈ కుంబకోణంపై సిబిఐ విచారణ చేసి ప్రభుత్వ సొమ్మును, పేద ప్రజల ప్రాణాలు పోవడానికి కారణమైన ప్రభుత్వాధికారులను శిక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

నిత్యాన్నదానానికి రూ.3 లక్షలు విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో ప్రఖ్యాతి చెందిన గండి క్షేత్ర శాశ్వత నిత్యాన్నదాన పథకానికి బెంగ ళూరు వాస్తవ్యులు సదిపిరాళ్ల సురేష్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి మాధవీలత, కుమార్తె మానసిరెడ్డి రూ.3,00,116 విరాళం అంద జేశారు. ఆ మేరకు వారు బెంగ ళూరు నుండి చక్రా యపేట ఎపి జిబిలో ఉన్న దేవ స్థానం బ్యాంకు ఖాతాకు జమ చేసి నట్లు ఆలయ అసిస్టెంట్ కమిష నర్ అలవలపాటి ముకుంద రెడ్డి తెలిపారు. దేవస్థాన ఖాతాకు విరాళాలు జమ చేసే భక్తులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతాభినందనలు తెలిపారు.

రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

సామాజిక మాధ్యమాల వేదికగా తప్పుడు, రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ సురేష్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాజకీయ వ్యక్తుల విగ్రహాలు, ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్తులు ధ్వంసం చేసే వారిని ఎట్టి పరిస్థితిలో వదిలేది లేదన్నారు. ప్రజాశాంతికి భంగం కలిగించినా లేదా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా ఉపేక్షిం చబోమన్నారు. ప్రభుత్వ ఆస్తులు ప్రజల సొత్తు కాబట్టి వాటిని రక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడికీ ఉందన్నారు. సామాజిక మాధ్యమాలు లేదా వాట్సాప్‌లో ఎలాంటి విద్వేషాలు, రెచ్చగొట్టే సందేశాలు, ఫోటోలు పోస్ట్ చేస్తే ఆ గ్రూప్ అడ్మిన్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. పట్టణంలో శాంతి, భద్రతలను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని సిఐ కోరారు.

ముద్దనూరు : రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఒకరిపైఒకరు దాడులకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సిఐ దస్తగిరి హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో శనివారం సిఐ ఆధ్వర్యంలో ఎస్ఐ మైనుద్దీన్ పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు.

దుర్గంధ భరితం.. ఆర్‌టిసి బస్టాండ్ ఆవరణం

- కంకర తేలిన రోడ్లతో ఇబ్బందులు
- తోపుడుబండ్లు, ఆటోలతో నిండిన ప్రాంగణం

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ ఆర్‌టిసి బస్టాండ్ దుర్గంధ భరితంగా మారి అసౌకర్యంగా ఉందని స్థానికులు, ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ ప్రాంగణమంతా చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండి రోగాలకు నిలయంగా మారిందని పేర్కొన్నారు. బస్టాండ్ సమీపంలో ఉన్న మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరడంతో ల ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారుతున్నట్లు అనేకమంది వాపోతున్నారు. కండక్టర్లు మలమూత్రశాలలకు వెళ్లాలంటే స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించవలసిన దుస్థితి ఏర్పడుత న్నట్లు సిబ్బంది వాపోతున్నారు. గతంలో బస్టాండ్‌లో మరుగుదొడ్లు నిర్వహణ బాగుండేదని ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్టాండ్ ఆవరణంలో అద్దెకు గదులు ఇచ్చి వారి వద్ద నుంచి వేలకు వేలు బాడుగలు వసూలు చేస్తూ మల మూత్ర శాలలో ఏర్పాటుకు నోచుకోకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు.

కంకర తేలిన బస్టాండ్ ఆవరణం

శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు

బస్టాండ్ ఆవరణంలో ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు

ప్రాంగణంలో కంకర తేలి ఉండటంతో బస్సులు, పాదచారులు వెళ్లడానికి వీలు లేకుండా ఉందని పేర్కొన్నారు. కంకర తేలిన బస్టాండ్ లో ప్రమాదలు జరిగేందుకు అవకాశాలు కూడా ఉన్నాయంటూ ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. బస్టాండ్ గదుల ద్వారా ఆర్‌టిసికి లాభం ఉన్నప్పటికీ ఏమాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదని విమర్శించారు. బస్టాండ్ ఎదుట తోపుడుబండ్లు, ఆటోలు పార్కింగ్ చేసి ఉండటంతో బస్టాండ్ లోనికి బస్సులు వెళ్లాలంటే చాలా ఇబ్బందికరంగా మారిందని అన్నారు. ప్రయివేట్ బస్సులు, వాహనాలు బస్టాండ్ ఆవరణంలోకి వస్తూ పోతూ ఉన్న అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. బస్టాండ్‌లో కంట్రోలర్ లేకపో వడం విడ్డూరంగా ఉందని దీని ద్వారా ప్రయివేట్ వాహనాలు విచ్చల విడిగా పెరగడమే కాకుండా ఆర్‌టిఒకు ఆర్థికంగా గండి పడుతుందని తెలిపారు. ఇప్పటికైనా ఆర్‌టిసి అధికారులు స్పందించి బస్టాండ్ ఆవరణాన్ని ఆధునీకరిం చాలని పేర్కొన్నారు. మరుగుదొడ్లను ఏర్పాటు చేసి ప్రయా ణీలకు, బస్టాండ్ ఆవరణంలో ఆటోలు, దుకాణాలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వయోజన బిసిజి టీకాపై అవగాహన

ప్రజాశక్తి-కలకడ

బిసిజి టీకాపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిషోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలం లోని మండెంవారి పల్లి, డి.గొల్లపల్లిలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు వర్గాలవారు తప్పనిసరిగా టిబి వ్యాధి రాకుండా బిసిజి టీకా చేసుకోవాలని కోరారు. ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి జయరామయ్య మాట్లాడుతూ క్షయవ్యాధి లేని భారతదేశం లక్ష్య సాధన కొరకే వయోజన బిసిజి టీకాలు భారత ప్రభుత్వం ప్రవేశపెట్టినదని అన్నారు. డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు వయోజనుల బిసిజి టీకా ప్రాముఖ్యతపై డాక్టర్ కిషోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. భవిష్యత్తులో టిబి రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా టీకా ఉపయోగపడుతుందని అన్నారు. మరణాల తీవ్రతను నివారిం చడంలో చాలా సురక్షితమైనదని, క్షయకు వ్యతిరేకంగా రోగనిరోధక శక్తిని మరింత పెంచుతుందని పేర్కొన్నారు. ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా 60 సంవత్సరాలు పైబడిన వారు, పొగపీల్చువారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు(18 సం నుంచి 60లోపు), టిబి జబ్బుతో కోలుకున్న వారు, వారి కుటుంబ సభ్యులకు, తగ్గ బరువు ఉన్నవారు టీకాకు అర్హులని తెలిపారు. అనంతరం

బిసిజి టీకాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గ్రామస్తులతో నినాదాలు చేస్తూ ర్యాలీ, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, ఆరోగ్య విస్తరణ అధికారి జయరామయ్య, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి, పిహెచ్ఎన్ సుబ్బరత్న, ఎంఎల్‌హెచ్‌పి, కె.కనకమ్మ, ఎఎన్ఎం వాణి, ఆశ కార్యకర్తలు గౌసియా, అనంత రాణి, రమణమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామోజీరావుకు ఘనంగా నివాళులు

ప్రజాశక్తి-సుండుపల్లె : ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మరణం పత్రిక రంగానికి తీరని లోటని జనతా దళ్ పార్టీ నేషనల్ కౌన్సిల్ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి ఒక ప్రకటన ద్వారా సంతాపం వ్యక్తం చేశారు. **చిట్వేలు:** ఈనాడు అధినేత రామోజీరావు మృతి పట్ల స్థానిక టిడిపి కార్యాలయంలో పార్టీ శ్రేణులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో చిట్వేలు టిడిపి మండల వైస్ ప్రెసిడెంట్ చక్రవర్తుల వెంకటేష్ రాజు, మైలపల్లి మాజీ సర్పంచ్ తమ్మిశెట్టి శ్రీనివాసులు, కోటయ్య నాయుడు, చంద్రమౌళి గౌడ్, కరీంబాషా, ఎస్‌సి సెల్ మండల నాయకుడు కొత్తూరు ఈశ్వరయ్య పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** రామోజీరావు మృతి పత్రికా రంగా నికి తీరని లోటుని లకిరెడ్డిపల్లి టిడిపి మండల నాయకులు ఆరిఫ్ అన్నారు. టిడిపి కార్యాల యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామోజీరావు లేని లోటు ఎవరు పూర్చలేని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మదన్మోహన్ రాజంపేట పార్లమెంట్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీ నాయక్, మసూద్, నసిరుద్దీన్ కాంటాక్ట్ రాజు, జయ చంద్రారెడ్డి, రాయవరం బాబు, పాల్గొన్నారు **.రాజంపేట అర్బన్ :** రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటని జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రామోజీరావు అస్తమయం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. **మదనపల్లె అర్బన్ :** ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హైదరాబాద్‌కు వెళ్లారు. రామోజీ ఫిల్మ్ సిటీలోని రామోజీరావు మృతదేహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. రెండు తెలుగు రాష్ట్రాలు ఓ గొప్ప వ్యక్తి ని కోల్పోయామని బరువెక్కిన హృదయంతో అన్నారు. **నందలూరు:** అక్షర యోధులు రామోజీరావు లాంటి మహనీయుడు మృతి రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు తీరని లోటు అని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ పేర్కొన్నారు. అరవపల్లిలో రామో జీరావు చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సయ్యద్ అమీర్, పోతురాజు మస్తానయ్య, హిమగిరి నాథ్ యాదవ్, మోడపోతుల రాము, మౌలా, తుమ్మాది శివ, పాల్గొన్నారు. **పుల్లంపేట :** రామోజీరావు మృతి చెందడం పత్రిక రంగానికి తీరని లోటుని రెడ్డిపల్లె మాజీ సర్పంచ్ రొంపిచర్ల మురళి తెలిపారు. రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రామోజీ తన చిన్నతనం నుంచి ఎన్నో కష్టాలు ఒరిజిరుగులు అనుభవించి నేడు ఈ స్థాయికి చేరుకోవడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది. **బి. కొత్తకోట :** అక్షర యోధుడు రామోజీరావు మరణం మీడియా,సినీ,పారిశ్రామిక రంగానికి తీరని లోటని రాష్ట్ర తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్ తాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నారాయణస్వామిరెడ్డి, కుడుము శ్రీనివాసులు బంగారు వెంకటరమణ, దేరంగుల నారాయణ, కనకంటి ప్రసాద్, గంజి మోహన, సుధాకర్, ఎమ్మెస్ నాసిర్, మోదిన్‌బాషా, ఎండి మస్తాన్, సమీవుల్లా, శిల్పా ఆంజనేయులు, ఆది, శరత్, శిల్పి రమణప్ప, సలీం, ప్రసాద్, నారాయణస్వామి, ప్రభాకర, ఓబులేసు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి

కేకులు తినిపించుకుంటున్న ఎన్‌టిఎ నాయకులు

ప్రజాశక్తి-పీలేరు

రాష్ట్రంలో కొత్తగా ఎర్పడిన కూటమి ప్రభుత్వం ఉద్యోగ విజయంగా భావిస్తున్నామని, రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని ఎన్‌టిఎ నాయకులు ఎం.రెడ్డి రమేష్‌బాబు, పోతంశెట్టి రమేష్, పచ్చార్ల సుధాకర్ అన్నారు. శనివారం పీలేరులోని టిటిడి కల్యాణ మండపంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎన్నో అనాలోచిత నిర్ణయాలతో విద్యా వ్యవస్థ నిర్వీర్యం అయ్యిందని అన్నారు. ప్రస్తుతం కొత్తగా ఏర్పడనున్న ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయని, విద్యార్థుల భవిష్యత్తు బాగుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉద్యోగులతో స్నేహపూర్వకంగా మెలిగే ప్రభుత్వంగా పని చయాలన్న ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఉద్యోగులకు ఎలాంటి ఆర్థికపరమైన, ఉద్యోగ పరమైన నష్టాలు ఉండవని భావిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర నాయకులు తరిగొండ సురేష్ కుమార్ మాట్లాడుతూ విద్యావ్యవస్థలోని యాప్స్ రద్దు చేసి ఉపాధ్యాయులను ఒత్తిడి నుంచి కాపాడాలని, జిఒ 117 రద్దు చేసి 1 నుంచి 5వ తరగతి వరకు ప్రాథమిక పాఠశాలలోను, 6 నుంచి 10 వరకు ఉన్నత పాఠశాలలోను విద్యార్థులు ఉండే విధంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. మనబడి, నాడు-నేడు వ్యవస్థలో జరిగిన అవకతవకలకు ప్రధానో పాధ్యాయులను బాధ్యులను చేయకుండా కాంట్రాక్టర్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

మండలాభివృద్ధికి కృషి చేస్తాం : టిడిపి

ప్రజాశక్తి - చాపాడు

మండలాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని టిడిపి మండల శాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఖాదర్‌పల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ప్రసాద్ ఆధ్వర్యంలో అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఎమ్మెల్యేగా పుట్టా సుధాకర్ యాదవ్ విజయం సాధించినందుకు ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుట్టా సుధాకర్ యాదవ్‌ను అన్ని వర్గాల ప్రజలు ఆదరిం చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి బాటలో నడిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డి.గురివిరెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ నాయబ్ రసూల్, టిడిపి నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్, రామాంజనేయులు, రామ్మోహన్, లక్ష్మీనారాయణ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ముర్రుపాలే బిడ్డకు మొదటి టీకా - డాక్టర్ ఓబులేసు

ప్రజాశక్తి - చాపాడు

చిన్నారులకు టీకాలే శ్రీరామరక్ష అని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.ఓబులేసు పేర్కొన్నారు. నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని యన్.అనంతపురం అంగన్వాడీ కేంద్రంలో శనివారం చేపట్టిన సాధారణ టీకాల కార్యక్రమ తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతి శనివారం సచివాలయం, అంగన్వాడీ కేంద్రాలో, ప్రతి బుధవారం తమ గ్రామాలకు వైద్య సిబ్బంది వచ్చినప్పుడు తప్పనిసరిగా పిల్లలకు టీకాలు వేయించాలని సూచించారు. ముర్రు పాలు బిడ్డకు మొదటి టీకాగా ఆయన పేర్కొన్నారు. ముర్రుపాలు ఎంతో శ్రేష్టమన్నారు. బిడ్డకు పాలివ్వడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్ రాదన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రు పాలు తాగించాలన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు టీకా తప్పనిసరిగా వేయాలని వైద్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి యం.రాఘవయ్య, ఆశా నోడల్ పర్సన్ సుకన్య, సూపర్‌వైజర్స్ బాబురెడ్డి, సరస్వతి, ఎఎన్ఎం సుజాత, అంగన్వాడీ కార్యకర్త నిర్మల, ఆశా కార్యకర్త కె.జయమ్మ పాల్గొన్నారు.

నేడు వేసవి ముగింపు కార్యక్రమాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణ పరిధిలోని శిల్పారామం లో వేసవి ముగింపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు స్థానిక యువరాజా డాన్స్ స్కూల్, మాస్టర్ యువకిషోర్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలు నిర్వహిస్తామన్నారు. పులివెందుల పట్టణ ప్రజలు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

కాలిపోయిన ఇంటిలో ఎలక్ట్రానిక్ సామగ్రి

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

- కాలి బూడిదైన ఇంటిలోని ఎలక్ట్రానిక్ సామగ్రి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ఇంట్లో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఇంటిలోని ఎలక్ట్రానిక్ వస్తువులు ఖాళీ బూడిదయ్యాయి. ఈ సంఘటన శనివారం మదనపల్లె పట్టణంలో జరిగింది. అగ్ని మాపక అధికారి శివప్ప తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం ప్రశాంత్‌నగర్ రెండవ క్రాస్‌లో నివాసం ఉంటున్న ప్రమీల ఇంటిలో ఉదయం ఉన్నట్లుండి మంటలు చెలరేగాయని చెప్పారు. ఇంట్లో నిద్రిస్తున్న ప్రమీల కుటుంబీకులు గట్టిగా కేకలు వేస్తూ బయటికి పరుగులు పెట్టారని అన్నారు. అప్రమత్తమైన స్థానికులు వెంటనే అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందివ్వడంతో ఫైర్ ఇంజన్ తీసుకొని వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నట్లు తెలిపారు. ఎగసిపడుతున్న మంటలను అదుపు చేసి పూర్తిగా అదుపు చేశామని అన్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష విలువచేసే ఫ్రిడ్జ్, వంట సామగ్రి, ఇతర వస్తువులు కాలిపోయాయని అన్నారు. ఈ మేరకు అగ్ని ప్రమాదాలనుంచి ఎలా బయటపడాలని అక్కడి స్థానికులకు అధికారి శివప్ప తెలిపారు. రెండో పట్టణ పోలీసులు ఈ ఘటనపై విచారణ చేపట్టారు.

కూలడానికి సిద్ధంగా చెట్టు

ప్రజాశక్తి-పుల్లంపేట

జాతీయ రహదారిపై ఎండిన వృక్షం

కడప-చెన్నై జాతీయ రహదారిపై అనంతంపల్లి గ్రామం వద్ద వయా అనంతంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉన్న చెట్టు కులడానికి సిద్ధంగా ఉంది. హైవేపై నిరంతరం వాహనాలు తిరుగుతూ ఉంటాయి. రానున్నది వర్షాకాలం కాబట్టి సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చెట్టును కూల్చివేయాలని గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. పాఠశాల దగ్గర్లోనే చెట్టు ఉండటంవల్ల మరో నాలుగు రోజుల్లో పాఠశాలలో ప్రారంభమవుతున్నాయని వెంటనే చెట్టును తొలగించవలసిందిగా ప్రజలు కోరుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చెట్టును కూల్చివేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

17 నుంచి గాలీటమ్మ తిరుణాల

ప్రజాశక్తి-గాలివీడు

ఈనెల 17, 18 తేదీల్లో గాలీటమ్మ తిరుణాల జరుగుతున్న సందర్భంగా 11న మంగళవారం వీరబల్లి వాస్తవ్యులు గాలివీటి విశ్వనాథరెడ్డి వారి కుటుంబ సభ్యులు గాలిటమ్మకు పట్టు వస్త్రాలు సమర్పణ చేయనున్నారు. 12 నుంచి 16వ తేదీ వరకు గాలివీడు గ్రామంలోని ప్రతి పల్లెకు సోలెం తిరగడానికి పల్లకి సిద్ధం చేశారు. పల్లకిని మంగళవారం గాలిటమ్మ కు సమర్పించనున్నారు.

నకిలీ విత్తనాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రైతులను నట్టేట ముంచుతున్న నకిలీ విత్తనాల వ్యాపారుల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (యంపిజె) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో కురుస్తున్న వర్షాల వల్ల ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారని తెలిపారు. నకలీ విత్తనాల వల్ల పంట నాశనమై రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నకలీ విత్తనాలు, పురుగుమందులతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పూర్తి నష్టపరిహారం ఇవ్వాలన్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని మోసం చేయడం అధికమైందన్నారు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి చేతికి పంట రాకపోగా పెట్టుబడులు రాకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల రాకతో ఖరీఫ్‌లో రైతులు పంటలు వేసేందుకు సిద్ధమవుతున్న వేళ మార్కెట్‌లో నకిలీ విత్తనాలు రావడం ఎక్కువయ్యాయన్నారు. కొన్నింటిని అధి కారులు పట్టుకుంటున్నప్పటికీ కొంత మంది వ్యాపారస్తులు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అమ్ముతున్నారన్నారు. వ్యవసాయ అధికారులు ముందు జాగ్రత్తగా నకిలీ విత్తనాలు వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి వ్యాపారస్తుల అంగళ్లను అధికారులు పర్మిషన్‌ను రద్దు చేసి కఠినంగా వ్యవహరించాలని సలీం డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలలు.. భవితకు పునాదులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా పిల్లల భవితకు పునాదులు ఏర్పడతాయని ఎంపీపీఎస్ (మెయిన్ స్కూల్) ప్రధానోపాధ్యాయులు సుబ్బిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఫీజులు లేకుండా ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో విద్యాబోధన నిర్వహిస్తున్నారని తెలిపారు. స్థానిక నగర పంచాయితీలో పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని తల్లితండ్రులను కోరుతూ ఇంటింటికి కరపత్రాలను పంపిణీ చేశారు. అర్హత, అనుభవం, అంకితభావం గల ఉపాధ్యాయులచే బోధిస్తారన్నారు. విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిళ్లకు గురికాకుండా ఆట, పాటల ద్వారా బోధిస్తారని తెలిపారు. ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం పథకం ఇలా పలు రకాల సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉంటాయని తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమణారెడ్డి, సర్వేశ్వరి, సుధారాణి పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు కరపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

క్రైం కార్నర్

రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడి ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సుమారు 25 సంవత్సరాల వయసున్న గుర్తుతెలియని యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న విషాదకర సంఘటన శనివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. కురబలకోట రైల్వేస్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటు చేసుకుంది. కదిరి రైల్వేహెడ్‌కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు..అర్ధరాత్రి సమయంలో కురబలకోట రైల్వే స్టేషన్ నేమ్ బోర్డు సమీపంలో గుర్తు తెలియని యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుని మృతి చెంది ఉండడాన్ని స్థానిక రైల్వే సిబ్బంది గుర్తించి సమాచారం అందించారని తెలిపారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పంచనామా అనంతరం పోస్ట్ మార్టం కోసం మదనపల్లె ప్రభుత్వ సర్వజన బోధనాస్పత్రికి తరలించినట్లు చెప్పారు. చనిపోయిన యువకుడు ఎవరనేది ఇంకా తెలియ రాలేదని, ఎవరికైనా వివరాలు తెలిస్తే 9133109537 కు సమాచారం అందించాలని కోరారు.